
ఆంధ్రజ్యోతి
నారాయణపేట
7
ఆదివారం 12 మే 2024



మద్యం దుకాణాలు సీజ్

ఆత్మకూరు,మే11: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆత్మకూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని మూడు వైన్స్ షాపులను సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే శాశ్వతంగా లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ తెలిపారు. ఎన్నికల అనంతరం మళ్లీ ప్రారంభించుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ ఎండి కదిర్, మహమ్మద్ పాషాలు పాల్గొన్నారు.

పదేళ్లు వంచనకు గురిచేసిన పాలకులను శిక్షించాలి

- ప్రముఖ సామాజిక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్



సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ సామాజిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్

పాలమూరు, మే11 : పదేళ్లు వంచనకు గురిచేసిన పాలకులను శిక్షించాలని ప్రముఖ సామాజిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఎం ఫంక్షన్‌హాలులో పదేళ్ల పాలనలో 'ప్రజా జీవితం-దేశ భవిష్యత్తు' అనే అంశంపై రాజ్యాంగ పరిరక్షణ కమిటీ, తెలంగాణ ప్రజా జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ భారత ప్రజలను వంచనకు గురిచేసిందన్నారు. రక్తసంబంధీకుల్లా ప్రేమగా ఉన్న భారత ప్రజల మధ్య మత చిచ్చును రేపి రక్తపాతం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతం మాటున నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచారన్నారు. బీజేపీ ఎన్నికల్లో మతాన్ని అస్త్రంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. అటువంటి పాలకులను శిక్షించడమా.... మళ్లీ గద్దెనెక్కించడమా ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. మతోన్మాదులను శిక్షించకుంటే వాళ్లు మొత్తం భారత ప్రజలను శిక్షిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో స్త్రీలను వివస్త్రాలు చేయడం, నాగరిక సమాజానికి మాయని మచ్చగా మిగిలిందన్నారు. భారత ప్రజలు మతోన్మాదం నుంచి బయట పడితేనే రాబోయే తరాలకు ఈ దేశంలో జీవించే యోగ్యత కలిగి ఉంటుందన్నారు. ఉర్దూ పత్రిక సంపాదకులు జనాబ్ అమెర్ అలీఖాన్ మాట్లాడుతూ ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మనం వేస్తున్న ప్రతి ఓటు దేశ భవిష్యత్తును ప్రతి ఫలిస్తుందని తెలిపారు. తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ఎన్నికలు రాజకీయ పార్టీల మధ్యన కాదని, నియంతృత్వ బీజేపీకి సబ్బండ భారతీయులకు మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. తెలంగాణ ప్రజా జేఏసీ కో-కన్వీనర్ కె.రవిచంద్ర మాట్లాడుతూ భారత సమాజంలో బీజేపీ వెదజల్లిన విషం కడగడం కోసం అనేక ఏళ్లు పడుతుందన్నారు. పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ యం.రాఘవచారి మాట్లాడుతూ పదేళ్లకాలంలో ప్రజాస్వామ్యవాదులను మేధావులను నిర్బంధం ద్వారా జైల్లో పెట్టారని, ప్రజల వైపు మాట్లాడే అనేకమందిపై ఉపా కేసులు నమోదు చేశారన్నారు. సమావేశంలో టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, నాయకులు హనీఫ్‌అహ్మద్, సుధాకర్, షేక్‌సిరాజ్, షేక్‌అబ్దుల్లా, మౌలానా తాజముల్, షేక్‌అబ్దుల్లా, మౌలానా తాజముల్, జనజ్వాల, లక్ష్మణ్‌గౌడ్, గట్టన్న , మోసిన్‌పాషా ఖాద్రి, తిమ్మప్ప, శ్రీశైలం, వెంకటేశ్వర్లు, పద్మావతి పాల్గొన్నారు.

చిన్నారి గొంతులో ఇరుక్కున్న క్యారెట్ ముక్క

- 48 గంటలు శ్రమించి ప్రాణగండం తప్పించిన వైద్యులు

కొత్తకోట, మే 11 : ఓ చిన్నారి గొంతులో క్యారెట్ ముక్క ఇరుక్కోని ప్రాణ పాయస్థితిలో ఉండగా, వైద్యులు 48 గంటలు శ్రమించి ప్రాణగండం తప్పించిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటు చేసుకుంది. శనివారం పట్టణంలోని రాహుల్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ హరిన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోపి ఫిజా (3) రెండు రోజుల కిందట ఇంట్లో క్యారెట్ ముక్కను నోట్లో పెట్టుకుంది. మింగలేక పోవడంతో గొంతులోనే ఇర్కుంది. ఉపిరి ఆడక చిన్నారి అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాహుల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించి డాక్టర్ హరిన్‌రెడ్డి తన బృందంతో సీపీఆర్ చికిత్స చేశారు. నోటిలోకి గొట్టం వేసి ఆక్సిజన్ అందించారు. స్కానింగ్‌తో ఏదోముక్క చిక్కునట్లు గుర్తించారు. బ్రాంకో స్కోప్ సహాయంతో ముక్కను తొలగించి వెంటిలేటర్‌పై వైద్యం అందించారు. 48 గంటల అనంతరం ఫిజా ఆరోగ్యం మెరుగు పడడంతో శనివారం డిశ్చార్జి చేశారు. ఫిజాకు పునర్జన్మ ప్రసాదించిన చిన్నపిల్లల డాక్టర్ మనీషారెడ్డి, పల్మానాలజిస్ట్ డాక్టర్ వెంకట్‌రెడ్డిలకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



క్యారెట్ ముక్కను తొలగించే ప్రయత్నం చేస్తున్న వైద్య బృందం

పీవీటీజీ గురుకుల పాఠశాలలో నేరుగా ప్రవేశాలు

మన్ననూర్, మే11: మన్ననూరు ఆదివాసీ బాలుర గిరిజన గురుకుల విద్యాల యం(పీవీటీజీ)లో 2024-25 విద్యా సంవత్సరంలో 3 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను నేరుగా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ నిమ్మల పద్మావతి తెలిపారు. ఆసక్తి గల చెంచు విద్యార్థులు నేరుగా ప్రవేశాలు పొందాలని కోరారు.

హత్యాయత్నం కేసులో నిందితుల రిమాండ్

- 24 గంటల వ్యవధిలో కేసును ఛేదించిన పోలీసులు

- వివరాలు వెల్లడించిన ఎస్ఐ శ్రీహరి



సోలీపూర్‌లో హత్యాయత్నం చేసిన నిందితులతో ఎస్ఐ శ్రీహరి

ఖిల్లాఘణపురం, మే11: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్ గ్రామంలో మంగనూరు చంద్రమ్మపై శుక్రవారం తెల్లవారు జామున హత్యాయత్నం చేసిన కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. నిందితులు మీసాల బాలరాజు, మంగనూరు మహేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఎస్ఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగనూరు చంద్రమ్మపై హత్యాయత్నం చేసిన సమయంలో కుక్కలు మొరగకపోవడంతో తెలిసినవాళ్లే అఘాయిత్యానికి పాల్పడి ఉంటారనే కోణంలో దర్యాప్తు చేశారు. ఇంటి పక్కనే ఉండే పాలివాళ్లు మంగనూరు గ్యాస్ కుర్మయ్య కుమారుడు నరేష్‌కు కాలికి గాయం కావడంతో మూడు రోజుల క్రితం మృతి చెందాడు. ఆరు నెలల క్రితం గ్యాస్ కుర్మయ్య భార్య సూర్యమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. వరుసగా ఇంటిలో మరణాలు సంభవిస్తున్నాయని గ్యాస్ కుర్మయ్య కుటుంబసభ్యులు గద్దె దగ్గర విచారణ చేయగా పాలివాళ్లు చేతబడి చేస్తున్నారని తెలిపారు. దాంతో మంగనూరు చంద్రమ్మ చేతబడి చేయడం వల్లే కుటుంబంలో వరున మరణాలు జరుగుతున్నాయని అనుమానించి కుర్మయ్య కుమారుడు మంగనూరు మహేష్ అతడి బావమరిది మీసాల బాలరాజు హత్య చేయడానికి ప్రయత్నించారు. మృతి చెందిన నరేష్ బట్టలు వేసుకుని చంపితే నరేష్ ఆత్మ సంతోషిస్తుందని మంగనూరు మహేష్‌ను కాపలా ఉంచి మద్యం మత్తులో మీసాల బాలరాజు నిద్రలో ఉన్న చంద్రమ్మ నోరు మూసి కమ్మ కత్తితో చెవి, గొంతుపై ఇష్టారీతిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచి మృతి చెందిందని భావించి పరారయ్యాడు. దాడికి పాల్పడిన కమ్మ కత్తి, ధరించిన బట్టలను బ్యాగ్‌లో పెట్టి వనపర్తి చెరువులో పడేశారు. పోలీసులు అనుమానంతో వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా చేతబడి చేసిందని చంద్రమ్మపై హత్యాయత్నం చేసినట్లు నిందితులు బాలరాజు, మహేష్ ఒప్పుకున్నారు. హత్య చేయడానికి ఉపయోగించిన కత్తిని , బట్టలను వనపర్తి చెరువు నుంచి పోలీసులు సేకరించారు. కేసును 24 గంటల్లో ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్న కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్ఐ శ్రీహరి, కానిస్టేబుల్ లింగం, ఆంజనేయులు, రమేష్, హోంగార్డు శ్రావణ్‌లను ప్రజాప్రతినిధులు, సోలీపూర్ గ్రామస్థులు అభినందించారు.

వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత



నర్వలో పట్టుబడిన నగదుతో పోలీసులు

నర్వ, మే 11 : నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం చౌరస్తాలో శనివారం పోలీసులు, ఎస్ఎస్‌టీ టీమ్ సభ్యులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. మహాలక్ష్మి వైన్స్‌కు చెందిన పవన్‌రెడ్డి, శంకర్‌రెడ్డిల వాహనంలో రూ. ఏడు లక్షలు నగదు పట్టుబడింది. వైన్స్ షాపునకు చెందిన డబ్బులు అని తెలిపినా ఎలాంటి రశీదు లేకపోవడంతో డబ్బులను సీజ్ చేసి గ్రీవెన్స్ సెల్‌కు పంపినట్లు నర్వ ఎస్ఐ కుర్మయ్య తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

యన్మన్‌గండ్ల సమీపంలో...

నవాబ్‌పేట: మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని యన్మన్‌గండ్ల సమీపంలో శనివారం ఉదయం కారులో తరలిస్తున్న సుమారు రూ. ఐదు లక్షల నగదును ఎన్నికల పరిశీలకులు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధికి సంబంధించిన కారులో డబ్బు తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో అధికారులు దారి కాచి పట్టుకున్నట్లు తెలిసింది. అయితే కారులో డ్రైవర్ మాత్రమే ఉన్నట్లు తెలిసింది. స్వాధీనం చేసుకున్న డబ్బును జిల్లా కేంద్రానికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే డబ్బు పట్టుబడిన విషయం వాస్తవమేనని స్థానికులు తెలిపారు. కానీ, పట్టుకున్న అధికారులు ఎవరు, పట్టుబడిన డబ్బు ఎంత అనే పూర్తి విషయాలు తెలియాల్సి ఉన్నది.

తనిఖీల్లో మద్యం పట్టివేత

అలంపూర్ చౌరస్తా, మే 11: ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద జాతీయరహదారిపై తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం వివిధ ప్రాంతాలకు తరలిస్తున్న మద్యం పట్టుబడినట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. పుల్లూరు గ్రామానికి చెందిన ఈ నరేష్‌గౌడు అనే వ్యక్తి బైక్‌పై తరలిస్తున్న 17.55లీటర్ల మద్యం విలువ రూ.14534లు, నంద్యాలకు చెందిన శివకుమార్‌రెడ్డి అనే వ్యక్తి కారులో తరలిస్తుండగా 18.100లీటర్ల మద్యం విలువ రూ. 11960లు, కర్నూలు నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన దూదేకుల రసుల్ అనే వ్యక్తి బైక్‌పై పంటపొలాలమీదుగా కర్నూలు వైపు తరలిస్తుండగా 8.640లీటర్ల, రూ.8640లు విలువ గల మద్యం సీసాలను తనిఖీల్లో పట్టుకున్నారు. ఇక ఫ్లయింగ్ స్కాడ్ ఆధ్వర్యంలో ఉండవల్లి మండల కేంద్రంలో జె వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇంటి సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 25.920లీ, విలువ రూ.27360,గల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి లింగేశ్వరబాబు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దేవరకద్ర, మే 11: ఎలాంటి అనుమతులు లేకుండా ఫిల్టర్ ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని అడవి అజీలాపూర్ గ్రామ సమీప వాగులో ఫిల్టర్ ఇసుక తయారు చేస్తుండగా గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


గుడి మల్కాపూర్ గ్రామ సమీపంలో..

హన్వాడ: మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని గుడి మల్కాపూర్ గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. నవాబ్‌పేట మండలం సాకల్‌పల్లి గ్రామానికి చెందిన శంకర్‌నాయక్ ట్రాక్టర్‌గా గుర్తించి అతడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఉపాధి హామీ పనుల వద్దే ప్రచారం

- 15 రోజులుగా కూలీల వద్దకే వివిధ పార్టీల నాయకులు

- ముగిసిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారపర్వం



ఉపాధి కూలీల వద్ద సంక్షేమ పథకాలు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు మోపతయ్య

అచ్చంపేట, మే 11 : వేసవిలో రైతులకు, రైతు కూలీలకు వ్యవసాయ పనులు లేకపోవడంతో అధికసంఖ్యలో ఉపాధి హామీ పనుల కోసం వెళ్తున్నారు. దాంతో గ్రామాలు ఉదయం సగానికి పైగా ఖాళీగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులకు గ్రామాలలో ప్రజలు లేక బోసిపోవడం కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామ ప్రజలు పనిచేసే చోటికే వివిధ పార్టీల నాయకులు వెళ్లి కూలీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసుకొని ఓట్లు వేయాలని అభ్యర్థిస్తూ తమ పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయ్యే మేనిఫెస్టోను వివరించారు. కొన్ని పార్టీల నాయకులు ముందస్తుగా కూలీలకు సమాచారం ఇచ్చి కూలీడబ్బులు చెల్లిస్తామని మాట తీసుకొన్నాకనే ప్రచారంలో పాల్గొంటున్నారు. ఏది ఏమైనా ఈ పార్లమెంట్ ఎన్నికల సందడి గ్రామాల్లో కనిపించనేలేదని చెప్పవచ్చు.

అరుణమ్మ హామీకి.. మోదీ గ్యారెంటీ

- ఓటమి భయంతో కాంగ్రెస్ ఎదురుదాడి
- బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై
- పాలమూరులో భారీ రోడ్ షో



రోడ్‌షోలో అభివాదం చేస్తున్న అన్నామలై, డీకే అరుణ తదితరులు

మహబూబ్‌నగర్, మే 11: అరుణమ్మ హామీ ఇచ్చిందంటే అందుకు మోదీ గ్యారెంటీ ఉంటుందని, ఎందుకంటే మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం, మోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమని బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై అన్నారు. దేశంలో బీజేపీ పదేళ్లుగా అవినీతి లేకుండా పాలన సాగిస్తుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ నిర్వహించిన భారీ రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఏనుగొండ జేజేఆర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మెట్టుగడ్డ, బస్టాండ్ మీదుగా క్లాక్‌టవర్ వరకు చేరుకుంది. ర్యాలీలో అన్నామలై, బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ర్యాలీలో పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో పాలమూరు ప్రధాన రహదారి కాషాయమయమైంది. క్లాక్ టవర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో అన్నామలై మాట్లాడారు. అరుణను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే కేంద్ర మంత్రి అవుతారని, పాలమూరు సమస్యలకు పరిష్కారం చూపుతారని చెప్పారు. మహిళ అని కూడా చూడకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అరుణను పబ్లిక్ మీటింగ్‌లలోనే అవమానకరంగా మాట్లాడుతున్నారని, ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు ఎదురుదాడి చేస్తున్నారని అన్నారు. బీజేపీ కేంద్రంలో 400 సీట్లు గెలువబోతోందని, ఆ చార్ సౌ పార్‌లో పాలమూరు సీటు పక్కాగా ఉంటుందని చెప్పారు. రేవంత్‌కు గుణపాఠం చెప్పేలా బీజేపీని 4 లక్షల మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి డీకే అరుణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎంపీగా గెలిపిస్తే సమస్యలపై మీ గొంతుకగా పార్లమెంట్‌లో ప్రస్తావించి, పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఓటమి భయంతో సీఎం పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారన్నారు.

బీజేపీని ఓడిద్దాం

- పేట - కొడంగల్ ఎత్తిపోతలతో సస్యశ్యామలం
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి
- నారాయణపేటలో కాంగ్రెస్ భారీ బైక్ ర్యాలీ



రోడ్ షోలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట, మే 11 : తెలంగాణకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అవినీతిపరుడు అని అవమానించిన బీజేపీని ఓడించాలని కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నారాయణపేటలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో కోట్లాది రూపాయాలతో అభివృద్ధి పనులు చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డిని ప్రధాని మోదీ అవినీతిపరుడు అంటూ అవమాన పరచడం సరైంది కాదన్నారు. సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్ ఎంపీని గెలిపించి ముఖ్యమంత్రికి ప్రజలు బహుమతిగా ఇవ్వాలన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఎడారిగా మారిన నారాయణపేట జిల్లాను సస్యశామలం చేసేందుకు పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని రూ.మూడు వేల కోట్లతో చేపట్టి శాశ్వత సాగు నీటిని అందించే అపర భగీరథుడు సీఎం రేవంత్‌రెడ్డి రుణం తీర్చుకొనేందుకు ఈ ప్రాంత ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి అండగా నిలవాలన్నారు. కృష్ణ - వికారాబాద్ రైల్వే లైన్ సాధిస్తామన్నారు. నైజాం పాలనలో ఏర్పడ్డ నారాయణపేట మునిసిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్, నారాయణపేట నియోజకవర్గాలను తమ రెండు కళ్లలాగా చూసుకుంటూ అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని విస్మరించిన బీజేపీ, బీఆర్ఎస్‌లను చిత్తుగా ఓడించాలన్నారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, వైస్ చైర్మన్ హరినారాయణ్ భట్టడ్, మాజీ మార్కెట్ చైర్మన్లు బండి వేణుగోపాల్, సుధాకర్, సరాఫ్ నాగరాజ్, ఎండీ సలీం, సదాశివరెడ్డి, మనోహర్‌గౌడ్, కొనంగేరి హన్మంతు, పవన్, మైనోద్దీన్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు

మహిళ ఆత్మహత్యాయత్నం

నవాబ్‌పేట, మే 11: ప్రైవేటు బ్యాంక్ ఒత్తిళ్లకు తాళలేక నవాబ్‌పేట మండలం దర్పల్లి గ్రామానికి చెందిన బాలమణి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. బాలమణి ఇంటి పేరుమీద కూతురు నర్సమ్మ పాలమూరులోని ఓ ప్రైవేట్ బ్యాంకులో రూ.తొమ్మిది లక్షల రుణం తీసుకుంది. వాయిదాలు చెల్లింపులో జాప్యం జరగడంతో బ్యాంకు అధికారులు బాలమణి ఇంటికి వచ్చి, ఒత్తిడి చేశారు. బాలమణి కూతురుకు తెలిపినా స్పందించకపోవడంతో శనివారం పురుగుల మందు తాగింది. జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.

రాజకీయ నాయకులు సహకరించాలి

» అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

నారాయణపేట టౌన్, మే 11 : రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించి, సహకరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం వరకు ప్రచారానికి తెరపడిందని, ఇక సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, డబ్బు, ఇతర బహుమతులు ఇచ్చినట్లు సమాచారం ఉంటే సీ విజిల్‌కు, కలెక్టరేట్ కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయాలన్నారు. శనివారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికలు ముగిసిన తర్వాత మహబూబ్‌నగర్‌లోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచే వరకు రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు జిల్లా కేంద్రం సమీపంలోని దత్త బృందావన్ బీఈడీ కళాశాల వద్ద ఈవీఎం, వీవీ ప్యాట్‌ల పంపిణీ జరుగుతుందని, ఇప్పటికే పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం 14న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో ఎన్నికల అబ్జర్వర్ పోలింగ్ ప్రక్రియ డ్యాకుమెంట్‌ను రాజకీయ పార్టీ ప్రతినిధులకు చూపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుమోహన్, డీపీఆర్వో రశీద్, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కురిసిన వర్షం.. రైతుల ఆందోళన



పేట శివారులో ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు

నారాయణపేట, మే 11 : నారాయణపేటలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దీంతో ధాన్యం తడవకుండా రైతులు కల్లాల వద్ద కవర్లు కప్పుతూ కానవచ్చారు. మరికొంత మంది రైతుల ధాన్యం తడిసింది.

ఆర్టీసీ నిలువు దోపిడీ

» ప్రత్యేక బస్సు పేరిట అదనంగా వసూళ్లు

నారాయణపేట, మే 11 : ప్రత్యేక బస్సు పేరిట కల్వకుర్తి డిపోకు చెందిన ఓ ఆర్టీసీ బస్సు అధిక బస్ చార్జీలు వసూళ్లు చేయడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు కల్వకుర్తి డిపోకు చెందిన ఓ ప్రత్యేక బస్సు పేటకు వేశారు. మామూలు సమయంలో హైదరా బాద్ నుంచి పేటకు ఓ వ్యక్తికి చార్జి రూ.230 ఉండగా ఈ ప్రత్యేక బస్సు కావడంతో అదనంగా రూ.120 వసూలు చేసి, ఏకంగా ఒక్కో ప్ర యాణికుడి నుంచి రూ.350 వసూలు చేశారు. ఎన్నికల కోసం స్వగ్రా మమైన నారాయణపేటకు వస్తున్న ప్రయాణికుల నుంచి ప్రత్యేక బస్సు పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రయాణికులు వాపోయారు. ఈ విషయంపై ఆర్టీసీ ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించండి



ఉపాధి హామీ కూలీలతో సీపీఐ(ఎంఎల్) నాయకులు

మాగనూరు, మే 11 : దేశంలో మతోన్మాద బీజేపీ పార్టీని ఓడించి ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని అచ్చంపేట, మాగనూరు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా ప్రజలను మోసం చేసిందన్నారు. పెట్రోలు, డిజీల్ గ్యాస్ ధరలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చి తగ్గించకపోగా ధరలు పెంచిన ఘనత మోదీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎస్.ఆంజనేయులు, వెంకటయ్య, రాఘవేంద్ర, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

● ఊట్కూర్ : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, ఎండీఏ పార్టీలను ఓడించి, కాంగ్రెస్, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ శనివారం మండల కేంద్రంతో పాటు పులిమామిడి గ్రామంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఊట్కూర్ ఎంకంపేట వీధిలో బీడీ కార్మికులతో సమావేశమైన సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ డివిజన్ నాయకుడు చెన్నప్ప మా ట్లాడారు. ప్రజలందరు మతోన్మాద బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులను ఓడించాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెను గెలిపించాలని కోరారు. అదే విధంగా పులిమామిడి గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలను కలిసి డివిజన్ కార్యదర్శి సలీం మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చంద్రాములు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా దళారుల దందా

» రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు



లారీలోకి లోడ్ చేస్తున్న ధాన్యం

మరికల్, మే 11 : ధాన్యం నాణ్యత లేదని, సరిగ్గా ఎండలేదని, వర్షాలు పడితే ధాన్యం తడిసి మరింత నష్టం వాటిల్లుతోందని దళారులు రైతులను భయపెడుతున్నారు. దీంతో పాటు తూకాల్లో మోసాలకు పాల్పడుతూ తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులను నిండా ముంచుతున్నారు. మార్కెట్ శాఖ నుంచి లైసెన్స్ లేని వ్యాపారులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి, గుట్టుగా పక్క రాష్ట్రం కర్ణాటకకు తరలించి ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని పూసల్‌పహడ్, తీలేరు గ్రామాల్లో దళారులు ఐదేళ్ల నుంచి వానాకాలం, యాసంగిలో మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కోత చేసిన పంటను కొనుగోలు చేయాలని రైతులు దళారులకు ఫోన్ చేయగానే క్షణాల్లో అక్కడికి చేరుకుంటారు. ధాన్యాన్ని పరిశీలించి తేమ, తాలు, బెర్కు ఉందని ఇలా లేనిపోని పేర్లు పెట్టి మార్కెట్ కంటే తక్కువ ధరకు అడుగుతారు. ఈ ధాన్యాన్ని ఎవరు కొనుగోలు చేయరని రైతులను భయపెట్టి రూ.2100 నుంచి రూ.2400లకు కొనుగోలు చేసి కర్ణాటకకు తరలిస్తున్నారు. మార్కెట్ శాఖ అనుమ తులు లేకుండా వ్యాపారం చేస్తున్న నకిలీ వ్యాపారులపై వ్యవసాయ శాఖ,పౌర సరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకోక పోవడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ఒకే ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తు న్నారు. మార్కెట్ శాఖ అనుమతులు లేకుండా వ్యాపారం చేస్తున్న నకిలీ వ్యాపారులపై వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వ్యాపారులంతా సిండికేట్‌గా మారి ఒకే ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

వ్యవసాయ మార్కెట్ అనుమతి లేకుండా రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్న లైసెన్స్ లేని వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. ధాన్యాన్ని పక్క రాష్ట్రానికి తరలించకుండా కర్ణాటక సరిహద్దు వద్ద నిఘా ఏర్పాటు చేస్తాం.

- బాలమణి, మార్కెటింగ్ శాఖ అధికారి

ముఖ్యమంత్రికి ఓటమి భయం

» మోదీని ఎదుర్కొనే ధైర్యం కాంగ్రెస్‌కు లేదు » విలేకరుల సమావేశంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

కోస్గి రూరల్, మే 11 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, దీంతో ఏం మాట్లాడుతున్నాడో అర్థంకాని పరిస్థితి నెలకొందని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. ఓటమి భయంతో ముఖ్యమంత్రి పాలమూరు పార్లమెంట్‌లో ఏడు సమావేశాలు నిర్వహించారన్నారు. శనివారం కోస్గిలోని ఏటీకే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాలమూరులో ఎంపీగా డీకే అరుణ గెలుస్తోందని తెలిసి రేవంత్‌రెడ్డి స్థాయి మరిచి మాట్లాడుతూ ప్రజలను మరోమారు మోసం చేసి గెలిచేందుకు కుట్ర చేస్తున్నాడన్నారు. ప్రజాసేవలో నా తండ్రి, సోదరుడు నక్సల్స్ చేతిలో మరణించారని నిరంతరం మా కుటుంబం ప్రజల్లో ఉందన్నారు. ప్రజాసేవ చేయడమే మా ఎజెండా అన్నారు. ఆడబిడ్డను ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు సహించరన్నారు. నా కుటుంబ సభ్యులు రోడ్ల కాంట్రాక్టులు చేస్తారన్నారవు కదా నిజాయతీగా కాంట్రాక్టులు చేశాం తప్ప మీలా బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు సంపాదించలేదన్నారు. పాలమూరును కేసీఆర్ దోచుకున్నడు ఇప్పుడు రేవంత్‌రెడ్డి దోచుకునేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాడన్నారు. నీవు కల్వకుర్తి నుంచి వచ్చి కొడంగల్ ప్రజలను మోసం చేశావు. ఇప్పుడు ఎంపీ అభ్యర్థిని కూడా అక్కడి నుంచే తెచ్చుకున్నావని ఎద్దేవా చేశారు. ఈ ప్రాంత బిడ్డ డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, మే 11 : జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా పోలీస్‌లు చర్యలు తీసుకోవాలని, తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్ద బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ కోరారు. శనివారం నారాయణపేట జేపీశెట్టి ఫంక్షన్ హాల్‌లో జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణకు వచ్చిన పోలీస్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 62 రూట్లుగా విభజించి, బందోబస్త్ వేయడం జరిగిందన్నారు. కర్ణాటక నుంచి వచ్చిన పోలీస్ ఫోర్స్, శిక్షణ పొందుతున్న రెండు కేంద్ర సాయుధ బలగాలు, 10 ప్లాటున్స్ మొత్తం 1,300 మంది పోలీస్ అధికారులు 296 పోలింగ్ లోకేషన్లలో 553 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించాల్సి ఉందన్నారు. పోలింగ్ ముందు రోజు, మరసటి రోజు, పోలింగ్ రోజు కూడా సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండి, పోలింగ్ కేంద్రాల దగ్గర 100 మీటర్ల వరకు ఎవరిని అనుమతించొద్దన్నారు. అదనపు ఎస్పీ నాగేంద్రుడు, సురేష్, రాజ్‌బీర్‌సింగ్, డీఎస్పీలు లింగయ్య, మహేష్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన పోలీసు సిబ్బంది

144 సెక్షన్ అమలు

ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో 144 సెక్షన్ అమలలో ఉంటుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ శనివారం తెలిపారు. శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి ఈనెల 14న సాయంత్రం ఆరు గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నలుగురు కంటే ఎక్కువగా గూమికూడరాదని అన్నారు. జిల్లాలో సభలు, ర్యాలీ నిషేధం అన్నారు. 13న పోలింగ్ కేంద్రాల దగ్గర 100 మీటర్ల లైన్ దాటి ఎవరు గుంపులుగా ఉండరాదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని, ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

కాంగ్రెస్‌తోనే సమగ్రాభివృద్ధి

» ఎంపీని గెలిపించి సీఎంకు బహుమతిగా ఇద్దాం : ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ముస్లిం పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూర్, మే 11 : కాంగ్రెస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వాకిటి శీహరి అన్నారు. శనివారం ఊట్కూర్ ఉర్దూ భవనంలో మైనార్టీ పెద్దలతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం అవుతోందన్నారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అని, కుల, మతం అనే తేడా లేదన్నారు. ఎన్నికల అర్హులందరికీ పథకాలు అందేలా చూస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఎంపీ కూడా కాంగ్రెస్‌కు చెందిన అభ్యర్థి ఉంటేనే కలిసి అభివృద్ధి చేసుకోవచ్చు అన్నారు. ఈ సందర్భంగా ఓబ్లాపూర్ మాజీ సర్పంచ్ భర్త తిమ్మప్ప బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా వేసి ఆహ్వానించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జలంధర్‌రెడ్డి, ఊట్కూర్ మండల ఇన్‌చార్జి బాలకిష్టారెడ్డి, ఊట్కూర్ మాజీ సర్పంచ్ సూర్య ప్రకాష్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మణెమ్మ, కాంగ్రెస్ మండలా ధ్యక్షుడు విజ్ఞేశ్వర్‌రెడ్డి, నాయకులు ఎల్కోటీ జనార్దన్‌రెడ్డి, ఎల్కోటీ లక్ష్మీకాంత్‌రెడ్డి, చిన్నపొర్ల మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, జగదీష్‌గౌడ్, మోహన్‌రెడ్డి, ముస్లిం పెద్దలు మన్సూర్ అహ్మద్, ఖుర్షీద్ మియ్య, బడేపీర్ మఖ్బుల్, నాసీర్‌ఖాన్, డాక్టర్ రహీంపాషా, డాక్టర్ లియాఖత్ అలీ తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్‌ను గెలిపించండి

» ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి » ధన్వాడలో భారీ రోడ్ షో

ధన్వాడ, మే 11 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి కోరారు. మండల కేంద్రమైన ధన్వాడలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలతో బాణాసంచా కాలుస్తూ ఊరేగింపు నిర్వహించారు. అప్పక్‌పల్లి, మెయిన్‌రోడ్డు, కంచుకోట, కోటపక్కా, ఎస్సీ కాలనీ, శ్రీరాంనగర్, లక్ష్మీవాడలో రోడ్ షో కొనసాగగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ తప్పక నెరవేరుస్తోందన్నారు. ఆగస్టు 15 నాటికి రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేయనున్నట్లు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, ఊసు బాలకృష్ణ, నాయకులు కందనూర్ రహిమాన్ ఖాన్, చీరాల సుధాకర్‌రెడ్డి, జట్రం లక్ష్మయ్య గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, నీరటి రాంచంద్రయ్య ముదిరాజ్, కెంచె రఘువీర్, సంద లక్ష్మన్న, సంద నర్సిములు, కెంచె నరేందర్, కెంచె నరసింహ, అజీమోద్దీన్, పూజారి నర్సిములు, టప్ప భాస్కర్, టప్ప కృష్ణ, సురేందర్‌గౌడ్, అలుగుమీది భాస్కర్, హరీశ్, ఒగ్గు వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతి బీజేపీతోనే సాధ్యం



పేటలో కుండ తయారు చేస్తున్న నాగూరావు నామాజీ

నారాయణపేట, మే 11 : బీజేపీతోనే దేశ భవిష్యత్ సాధ్యమని, మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదీని గెలించేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి డీకే అరుణను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ పిలుపునిచ్చారు. శనివారం నారాయణపేటలోని 1, 9, 14, 16 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు కాలేదని విమర్శించారు. మోదీ సభను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిద్ధి వెంకట్రాములు, గౌరిశంకర్, దామోదర్‌గౌడ్, కేదర్ పాల్గొన్నారు.

ప్రతీ పథకం అమలులో కేంద్రం వాటా

మద్దూర్ : రాష్ట్రం అమలు చేసే ప్రతీ సంక్షేమ పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ, పగడాకుల శ్రీనివాస్, రతంగ్‌పాండురెడ్డి అన్నారు. శనివారం మద్దూర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో రూ.11.70 లక్షలు మరుగుదొడ్లకు నిధులు ఇచ్చారు. ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.98.50 లక్షల నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి రూ.ఐదు వేల కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలమైందని, తన సీఎం పదవిని కాపాడుకోడానికి ప్రయత్ని స్తున్నారే తప్ప అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. జిల్లాల కుదింపునకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తే చూస్తూ ఉరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మదన్, శంకర్, శివరాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

జిల్లాకు ఒక్క హామీ ఇవ్వని పీఎం

» నారాయణపేట జిల్లాపై స్పష్టత ఇవ్వని సీఎం

» విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి

నారాయణపేట టౌన్, మే 11 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జన సభకు హాజరైన ప్రధాని నరేంద్రమోదీ జిల్లాకు ఏ ఒక్క హామీ కూడా ఇవ్వకుండా రెచ్చగొట్టె ప్రసంగం చేసి వెళ్లిపోయారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి అన్నారు. కనీసం పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా, జిల్లాకు నవోదయ విద్యాలయం, సైనిక పాఠశాల మంజూరు, మరికల్ నుంచి రుద్రసముద్రం వరకు జాతీయ రహదారి నిర్మాణం, కృష్ణ - వికారాబాద్ రైల్వే లైన్ నిర్మాణానికి నిధుల మంజూరై ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. అదే విధంగా నారాయణపేటకు మూడవ సారి ఎన్నికల ప్రచారంలో భాగంగా మక్తల్‌కు వచ్చిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా ఉంటుందా? ఊడుతదా? అనే విషయంపై స్పష్టత ఇవ్వలేదని, కనీసం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సైతం జిల్లాపై ఎలాంటి హామీ ఇవ్వకుండా ఉండడం శోచనీయం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సింగారం చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు ప్రధాని రావడం సంతోషకరమేనని, కానీ ఈ ప్రాంత సమస్యలపై ఏ ఒక్క హామీ ఇవ్వకపోవడం ఈ ప్రాంత అభివృద్ధిపై వారికి ఎంత శ్రద్ధ ఉందో జిల్లా ప్రజలు గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో ఉగాది లోపు నూతన మండలాలు చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఆ ఊసేలేదన్నారు. 24 గంటల్లో వీటిపై జిల్లా ప్రజలకు ఎంపీ అభ్యర్థులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో జై తెలంగాణ నినాదం వినిపించాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలన్నారు.

బీజేపీలో చేరిన వినయ్‌మిత్ర

నారాయణపేట, మే 11 : నారాయణపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేసిన వినయ్‌మిత్ర యాదవ్ శనివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా డీకే అరుణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘువీర్‌యాదవ్, శ్రీపాద్ ఉన్నారు.

కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ధన్వాడ, మే 11 : మండల కేంద్రమైన ధన్వాడలో జాతీయ ఉపాధి హామీ కూలీలకు శనివారం బీఆర్ఎస్ నాయకులు మజ్జిగ ప్యాకెట్లు ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వడ్ల శాంతికుమార్, శివారెడ్డి, ఎండీ నాసర్ పాల్గొన్నారు.

మోదీ సభ విజయవంతం

నారాయణపేట టౌన్, మే 11 : జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ప్రధాని నరేంద్రమోదీ సభ విజయవంతమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రఘురామయ్య గౌడ్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఊహించని విధంగా జనం సభకు వచ్చారని, ఈ సభతో డీకే అరుణ విజయం తేలిపోయిందన్నారు. సభను విజయవంతం చేసిన ప్రజలకు, సహకరించిన రెవెన్యూ, పోలీస్, మునిసిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

హజ్ యాత్రికులకు సన్మానం

మక్తల్, మే 11 : మక్తల్ నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న నూరుద్దీన్, కరమతుల్లబేగ్, జావిద్ అలీని శనివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తన నివాస గృహం వద్ద ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గణేష్‌కుమార్, నాయకులు బోయ రవి కుమార్, బిల్డర్ తాయప్ప, కావలి శ్రీహరి చెన్నయ్య, సలాంబిన్ ఉమర్, రంజాన్‌రాజ, పూల వెంకటేష్, వల్లంపల్లి లక్ష్మణ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, మే 11 : నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ధాన్యం విక్రయాలు జోరుగా కొనసాగాయి. వరి (సోనా) 8,034 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.2,455, కనిష్ఠంగా రూ.1,681 పలికింది. వరి (హంస) 36 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ. 1,850, కనిష్ఠంగా రూ. 1,740, జొన్నలు 43 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.4,666, కనిష్ఠంగా రూ.2,199, పెసర్లు తొమ్మిది క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.8,003, కనిష్ఠంగా రూ.6,608, చింతపండు ఐదు క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.5,309, కనిష్ఠంగా రూ.4,000 పలికింది. కాగా సాయంత్రం నాలుగు గంటలకు వర్షం కురడవడంతో ధాన్యం తడవకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పి వర్షం తగ్గిన తర్వాత ధాన్యం కాటాలను నిర్వహించారు.

'బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వండి'

కోస్గి రూరల్, మే 11 : ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చి గెలిపించాలని మాజీ స్పోర్ట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కోస్గిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు ఎంపీగా మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఆరు గ్యారెంటీలతో మోసం చేసిన వారిని ఓడించాలన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రామకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



ధన్వాడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ధన్వాడ, మే 11 : మండల కేంద్రంతోపాటు గున్ముక్ల, గోటూర్ గ్రామాల్లో బీజేపీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీజేపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుర్వ మల్లయ్య, కెంచె భాస్కర్, కురుమూర్తి, మాదరం రవిగౌడ్, చాకలి శ్రీనివాసులు, లచ్చన్న గౌడ్, శేఖర్, గున్ముక్ల ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

● దామరగిద్ద : బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని బీజేపీ మండలాధ్యక్షుడు సత్తి సత్యనారాయణ అన్నారు. శనివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు కోసం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ఇంటింటికి వెళ్లి ఓటర్లకు మోదీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ ఫలాల గురించి వివరిస్తూ బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్‌రావు, శ్రీను, నారాయణతో పాటు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● కృష్ణ : మహబూబ్‌నగర్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి డీకే అరుణ తరఫున మండల కేంద్రంతో పాటు చేగుంట, కున్సీ, గుడెబల్లూరు, హిందూపూర్ గ్రామాల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ ఎన్నికల్లో మరోసారి మోసపోకుండా బీజేపీకి అధికారం కట్టబెట్టాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సురేష్, సంజీవ్‌రెడ్డి, వెంకటేష్, మండలాధ్యక్షుడు శ్రీనివాసులు, పోలీస్ పాటిల్, రవిగౌడ, బాలరాజు పాల్గొన్నారు.

● మాగనూరు : బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కంకణబద్ధులై పని చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గొల్ల నారాయణ, బీజేపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి, వర్కూరు, మాగనూరు, అచ్చంపేట, నేరేడుగమ్ము దొడ్డి, భైరంపల్లి, పర్మన్‌దొడ్డి, గజరందొడ్డి, పుంజనూరు, ఓబులాపూర్ గ్రామాల్లో డీకే అరుణ తరఫున ఇంటింటికి తిరిగి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలమ్మ, భరత్‌కుమార్, డీలర్ వాబయ్య, మాజీ సర్పంచు నర్సింహులు, నరేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బొంబాయి మురళి, చాకలి వాబయ్య, కడిచూరు సుమన్, పెద్దింటి మారుతి పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి'

మాగనూరు, మే 11 : తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టీఎస్ టీపీసీ మాజీ చైర్మన్ దేవర మల్లప్ప అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని అడవి సత్యారం, మందిపల్లి, కొల్పూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోని కురువ యాదవ సంఘం నాయకులు, గ్రామస్థులతో మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కోసం హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నాయకులు శివరామిరెడ్డి, ముద్దు రాములు, శంకర్, లింగం, మాజీ వీఆర్వో వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

కృష్ణ, మే 11 : మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా మండల కేంద్రంతో పాటు కూసుమూర్తి, చేగుంట, ఐనాపురం గ్రామాల్లో మండల ప్రధాన కార్యదర్శి మోనేష్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని గడువు మీద గడువులు చెబుతూ రైతులు, పింఛన్‌దారుల మనోభావాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వానికి ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మపాటిల్, కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ ఖాదర్, మాజీ సర్పంచు శివప్ప, రామకృష్ణ దణి, నరసింహారెడ్డి, మాజీ సర్పంచు నింగప్ప, కృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అరెకటికల మద్దతు

నారాయణపేట, మే 11 : కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర అరెకటిక అభివృద్ధి సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూంపల్లి అశోక్‌జీ పేర్కొన్నారు. శనివారం నారాయణపేట సీవీఆర్ బంగ్లాలో ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని కలిసి మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి, అరెకటికల సంఘం నాయకులు అశోక్, ఖాజారామ్, రమేష్, శివరాములు, రవికుమార్, లింగేశ్వర్ పాల్గొన్నారు.